## తోట్నూరు నాగేశ్వరరావు — ఆధునిక నీతికథలు

భీమసేనరావుకు బి.కాం. ఫైనలియర్‌లో పెళ్ళయింది. పెళ్ళిచూపులకు బందరు వెళ్ళినప్పుడు సన్నగా, బంటిపేట గొలుసులా వున్న సునీతను చూసి, 'అబ్బ! పిల్ల యింత పల్చగా వుందేం! ఎముకలే గాని, కండలు ఏ కోశానా లేవు. తనకు జోడు కుదురుతుందా!' అనుకున్నాడు. ఎత్తు సరిపడానే వుంది. రంగు మేలిమి బంగారం. ముక్కు సంపెంగమొగ్గ. మొహం కోలమొహం. పెదవులు లేత తమలపాకులు. కళ్ళు సూదంటు రాళ్ళు. వొళ్ళే ఎత్తుకు తగినట్టుగా లేదు. చేతులు సన్నగా వున్నాయి. స్త్రీత్వానికి చిహ్నమైన వక్షోజాలు ఉన్నాయో లేవో అన్న అనుమానాన్ని కలిగిస్తున్నాయి. టెన్నిస్‌కోర్టు గుర్తుకొచ్చింది. భుజాలమంచి కిందివరకూ వయస్సులో వున్న కన్నెపిల్లకుండాల్సిన ఎత్తుపల్లాలు అట్టే లేవు మరి. ఆమెను పెళ్ళిచేసుకోవడానికి ఒప్పుకోవడమా, లేదా అనే సందిగ్ధంలో భీమసేనరావు పానకంలోపడ్డ ఈగలాగ కొట్టుమిట్టాడుతుండగా, "పిల్లకేం పుత్తడి బొమ్మలా వుంది" అనేసింది అతని తల్లి. "పెళ్ళయ్యాక పిల్ల తేలుతుంది" అన్నాడు తండ్రి. భీమసేనరావుకు గుటక పడలేదు. నాలుక మడతపడింది.

"కుటుంబం మంచిది. సాంప్రదాయం శ్రేష్ఠమైంది. కట్నం ఆశించినంత కంటె అధికం. లాంఛనాలు భారీఎత్తున ముట్టజెబుతామంటున్నారు. ఇంకా కావాల్సిందేముంది! తాంబూలాలు పుచ్చుకుందాం" అనేశారు భీమసేనరావు తల్లిదండ్రులు.

ఎనభై అయిదు కిలోల బరువున్న భీమసేనరావుతో నలభై రెండు కిలోల బరువున్న సునీత పెళ్ళి ఉన్నంతలో వైభవోపేతంగా జరిగింది.

భీమసేనరావు బి.కాం. మొదటిశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. అతని మామగారు ఎల్ ఐ.సి.లో వుద్యోగం వేయించారు.

బందరులో బుట్టాయిపేటలో ఓ రెండున్నర గదుల ఇల్లు అద్దెకు తీసుకొని భీమసేనరావు కొత్తకాపురం పెట్టాడు అత్తగారివూరు అదేకాబట్టి ఫర్లాంగు దూరంలోనే అత్తగారిల్లు ఉండికాబట్టి భీమసేనరావుకు ఎలోటూ లేకుండా జరిగిపోతోంది.

మామగారి ఇన్‌ఫ్లుయన్స్‌వల్ల అయిదేళ్ళల్లో భీమసేనరావు ప్రమోషన్ సంపాదించాడు. మరో అయిదేళ్ళలో స్వశక్తివల్ల కానివ్వండి, పై అధికార్ల అతి

మానంవల్ల కావివ్వండి, అదృష్టం అక్కడికు రావడంవల్ల కానివ్వండి భీమసేన రావు ఆఫీసరయ్యాడు.

ఈ పదేళ్ళలో భీమసేనరావు బరువులో ఏమంత హెచ్చుతగ్గులు రాలేదు గాని, సునీత మాత్రం కాస్త వొళ్ళుచేసింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. వెంటనే భీమసేనరావు ఫ్యామిలీప్లానింగ్ పద్ధతిని అచరించి, ఆపరేషన్ చేయించుకొన్నాడు.

పదేళ్ళలో సునీత పది కిలోలవరకు బరువు పెరిగింది. భీమసేనరావు ఎంతో సంతోషించాడు. మరో పదికిలోల బరువు పెరిగితే తనకు జోడు దీటుగా వుంటుందని ఆశించాడు. ఆ ఉద్దేశంతోనే వారానికి రెండుసార్లు రెండు కిలోల స్వీట్లు, మూడుసార్లు మూడు డజన్ల పండ్లూ, కోడిగుడ్లూ, చేపలు, మాంసం మొదలైన సరుకుల్ని తెచ్చి పడేయసాగాడు.

వాటి నన్నింటినీ సునీత తింటూంటే చూసి ఆనందించేవాడు భీమసేనరావు.

మరో రెండేళ్ళల్లో సునీత మరో పదికిలోల బరువు పెరిగింది. బంగారంపై సూర్యకాంతి పడినప్పటి రంగు తేలింది. పాత జాకెట్లు పనికిరాకుండా పోయాయి. కొత్త జాకెట్లకు గుడ్డ ఎక్కువ పట్టసాగింది. కాళ్ళు అరటిస్తంభాలయ్యాయి; చేతులు పొట్లాలయ్యాయి; మెడ గుండ్రమైంది; మొహం వెడల్పయింది; శరీరం పైజాతోపాటు రొమ్ముకట్టు పెరిగింది; నడుం చుట్టూ మడతలు పెరిగాయి. ఆమె ఒడ్డూ పొడుపూ దాదాపు భీమసేనరావుతో పోటీపడే పరిమాణానికి చేరుకున్నాయి.

ఒకరోజు సాయంకాలం ఇద్దరూ సినిమాకు బయల్దేరారు. స్కూటరు వెనుక ఆమెను ఎక్కించుకున్నాడు. స్కూటరు స్టార్ట్ చేశాడు. బ్యాలన్సు కుదర లేదు. వెనుక సీటు బరువుగా వున్నట్టు అనిపించింది. మొహం చిట్లించుకున్నాడు భీమసేనరావు. యాభై గజాలు పోయేసరికి వెనకటైరు బరస్టయింది. స్టెపినీ మార్చుకోవడానికి పదిహేను నిమిషాలైంది. తీరా సినిమాహాలు దగ్గర కెళ్ళేటప్పటికి 'హౌస్‌ఫుల్' బోర్డు ఎదురైంది.

"ఇంటికెళదామా?" అన్నాడు భీమసేనరావు.

"ఇప్పు డింటికెళ్ళి ఏం చేస్తాం? ఏదైనా హోటల్‌కెళ్ళి భోంచేద్దాం" అంది సునీత.

ఒక నాన్‌వెజిటేరియన్ ఎయిర్‌కండిషన్డు హోటల్‌కెళ్ళారు. ఇద్దరికీ బిల్లు నలభై రెండు రూపాయలైంది.

సునీత మరీ పూరిపోవడాన్ని గురించి దిగులుపట్టుకుంది భీమసేనరావుకు. స్వీట్లు, పండ్లు, కోడిగుడ్లు, కోడిమాంసం, చేపలు మొదలైనవి తీసుకురావడం

మూసివేశాడు. అయినా సునీత బరువు తగ్గలేదు. మరో అయిదు కిలోలు పెరిగింది. ఆ దిగులుతో భీమసేనరావు అయిదు కిలోల బరువు తగ్గాడు.

నెల నెలకూ భార్య బరువు పెరుగుతూన్నట్టు భీమసేనరావు కనిపెట్టాడు. అతనికి కారణమేమీ ప్రత్యేకంగా కనబడలేదు అతను ఆఫీసుకెళుతూ ఉదయం తొమ్మిది గంటలకి భోంచేస్తాడు సునీత తర్వాత భోంచేస్తుంది. సెలవు రోజుల్లోనూ, ఆదివారాలు మటుకు భార్యతో, పిల్లలతో కలిసి భోంచేస్తాడు.

ఒకరోజు ఆదివారం అందరూ భోజనానికి కూర్చున్నారు. పిల్లలు ముందు లేచారు. ఆ తర్వాత భీమసేనరావు భోజనం ముగించాడు. సునీత నెమ్మదిగా తింటూనేవుంది. ఆ పూట చేసిన వంకాయ వేపుడూ, పప్పుపులుసు, బీరకాయ పచ్చడీ అయిపోగా, సొరకాయ పులుసూ, చిన్నగిన్నెలో అన్నమూ తీసింది. వాటిని కలుపుకొని తినసాగింది సునీత.

భీమసేనరావుకు ఆశ్చర్యంతో కనురెప్పలు వాలలేదు. ఆమెది కడుపా, కొల్లేటి చెరువా? అనుకున్నాడు.

"రాత్రి మిగిలినవి పనిమనిషి కిచ్చేయచ్చుగా సునీతా!" అన్నాడు భీమసేనరావు మంగలంలో ఉప్పుగల్లు పడ్డట్టు మొహం చిట్లించి.

"మీరు చెప్పేది భలేగా వుందండీ. కిలో బియ్యం నాలుగు రూపాయలు. కిలో బెండకాయలు ఆరు రూపాయలు. సొరకాయ అయిదురూపాయలు, అంతంత ఖరీదుపెట్టి కొని మిగిలాయి గదా అని పనిమనిషికిస్తామేమిటి? మన పక్కింటి పర్వతలక్ష్మిగారు మూడ్రోజుల్నాటి కూరలు కూడా ఎంచక్కా ఫ్రిజ్‌లో వుంచుకొని తింటుందనీ? మగాళ్ళకేం ఎన్నయినా చెబుతారు? ఇలా అడపాదడపా మిగిలిన వంటకాలు ఆడవాళ్ళు తింటూండబట్టే మగవాళ్ళకు ఆడవాళ్ళు చేసే పొదుపు తెల్సిరాదు. ఈ రోజుల్లో ఆడవాళ్ళెవరూ మిగిలిన వంటకాల్ని అవతల పారేయరు" అంది సునీత దీర్ఘాలు తీస్తూ.

"అంటే ఆకలి లేకపోయినా తింటారనా?" అన్నాడు భీమసేనరావు నోరు వెళ్ళబెట్టి.

"మరి?" అంది సునీత రాత్రి మిగిలిన అన్నంలో రాత్రి మిగిలిన సొరకాయ పులుసు గుమ్మరించుకుంటూ.

తన భార్య సునీతా, పక్కింటి పర్వతలక్ష్మి, ఎదురింటి వెంకాయమ్మా, మరికొంతమంది ఆడవాళ్ళు ఎరువువేసిన అరటిచెట్లలా ఎందుకు ఊరిపోతారో అప్పుడు అర్థమైంది భీమసేనరావుకు!

*కొంతమంది ఆడవాళ్ళ ఆకలికి అర్థంలేకపోయినా పరమార్థముంటుంది*